# సారె

- ఆల్ ఇండియా రేడియో, 1996

'సారె' అనే పదం
మన సంప్రదాయంలో ఎంతలా జీర్ణించుకు పోయిందంటే....
కారే కన్నీళ్ళకు సైతం కరగనంత....

"ఏవిటిది జయమ్మా! ఎంత కాలమయింది... నేను యమునకు ఆపరేషన్ చేయాలని చెప్పి?.... ఇప్పుడా తీసుకొచ్చేది?.... అంతా మునిగాకా?" కొంత కటువుగానే అన్నాను. జయమ్మ దూరపు బంధువు యమునకు పరీక్ష చేసి బయటకు పంపాక.

ఆమె మాట్లాడలేదు. తల వంచుకుంది. జనవరి ఫస్టన నేను చూసిన ఒకే ఒక్క పేషంటు యమున. పైగా మా పాలమ్మాయి తీసుకొచ్చిన కేస్... గుర్తుండకుండా ఎలా వుంటుంది నాకు?

కొన్ని క్షణాల తర్వాత తలెత్తింది జయమ్మ.

"ఏమైందమ్మా?"

కోప్పడినంత తేలిగ్గా వున్న విషయం చెప్పలేకపోయాను. యమునకు గర్భసంచి క్రింద భాగంలో పుండు వుందనీ... ముక్క పరీక్షచేసి అది కేన్సర్‌కు తిరిగే సూచన లున్నాయనీ... ఆపరేషన్ చేయించుకోమనీ తను చెప్పి ఇప్పటికి పది నెలలయింది. అప్పుడు సరేనని చెప్పి వెళ్ళిన యమున ఇప్పుడు పాలిపోయిన ముఖంతో ప్రత్యక్ష మయింది. నలభై ఏళ్ళన్నా దాటని యమునకున్న పుండు... కేన్సర్‌గా మారుతున్న వైనం తెలిసిన ఆవేశంలో కోప్పడ్డానేగానీ నిజానికి... మధ్యతరగతి పేషంటుకు ఎన్ని ఇబ్బందులో?... అంగబలం... ఆర్థిక బలం ఏది లేదో పాపం....

"ఏమీ లేదు కానీ.... అసలెందుకు రాలేదిన్ని రోజులూ?" మెత్తగా అడిగానీసారి.

జయమ్మ నేలమీద చతికిలబడింది.

"అలా కూర్చో...." కుర్చీ చూపించాను.

"పరవాలేదు లేమ్మా...."

"ఆ రోజు మీ కాడకు రావాలనే అనుకున్నాం... చిన్నదానికని చేయించిన రెండు పేటల గొలుసు, దాని వుంగరం కుదవపెట్టి శెట్టిగారి దగ్గర మూడువేలు తెచ్చామా?... ఇంతలో యమున ఆఖరి ఆడబిడ్డకు పెట్టాల్సిన ఉగాది సారె పెట్టి కూతుర్ని అత్తగారింట్లో వదిలి రాకపోతే తల బద్దలు కొట్టుకుని చస్తానని.... మొండికేసుకుంది వాళ్ళ అత్త... మొగుడు దమ్మిడీకి పనికిరాడుగానీ, పెళ్ళాన్ని కొట్టడానికి మాత్తరం పనికొచ్చాడు. అంతే... తినుబండారాలు, పళ్ళూ, కోకలు... వాటికే అయిపోయింది. రెండేలు... దాని అత్త మొహం మాతరం కళ కళ్ళాడిపోయింది. దీని ఆపరేషన్‌కి ఇంకేం చాలుద్ది?"

"సరేలే... కాలు చెయ్యా కూడదీసుకుని వద్దామనుకుంటే... యమున రెండో కూతురికి పెళ్ళయి పది నెలలన్నా కాలేదు... ఏదో పుట్టి మునిగిపోయినట్టు ఎంబడే కడుపు తెచ్చుకుందా... ఇప్పుడు ఏడో నెల... కడుపు సారె పెట్టి తీసుకెళ్ళమని అత్త తగువు... ఎట్టాగూ ఇది చాల్దుకదాని... ఇంకొద్ది అప్పుచేసి... కూతురు కాపురం ఏమయిపోద్దోనని... సారె పెట్టి పిల్లను తెచ్చుకుని.... హాయిగా గాలి పీల్చుకుంది... తన రెక్కల కష్టంతో నాలుగు రాళ్ళు కూడబెట్టుకుని వద్దామనుకుంటుంటే... పెద్ద కూతురు బిడ్డకు పురిటినాడు గురిగింజంతన్నా బంగారం పెట్టలేదంట. అందుకని మెళ్ళోకి గొలుసు తెచ్చుకోమని కోడలిని తరిమేసినాది పుట్టింటికి.... దానత్త... పోన్లే కూతురు కళ్ళముందే వుంటది. ఆపరేషనప్పుడు సాయంగా వుంటదని వూరుకున్నాం...

"ఇలా అని చెప్పంటే... గవర్నమెంటు హాస్పిటల్‌కి వ్రాసివ్వకపోయానా జయమ్మా" ఆమెను ఆపుతూ అన్నాను.

"అదురుష్టముండొద్దమ్మా... ఏదో లేమ్మా... ఈ నాటికి కూడబెట్టుకొనొచ్చాం... చాలిద్దో చాలదో..." జయమ్మ దిగులుపడ్తోంది.

నాకు జాలేసింది. "ఆపరేషన్‌కు ఫిట్ అవుతుందో లేదో... చూడాలి..." అని అన్నానో లేదో... ఆమె చప్పున లేచింది.

"చూడమ్మో.... ఎట్టోకట్టు చేసేయమ్మో... అది లేకపోతే ఆ ఇల్లు గడవదు తల్లో... అసలీరోజైనా మొండికి పడివచ్చేం... యమున ఆడబిడ్డకు... యమున కూతిరికి సారె పెట్టుళ్ళా... అది తెలిసి రెండో ఆడబిడ్డ మొగుడు తనకి పెళ్లప్పుడు అంపకాల సారె సరిగ్గా పెట్టలేదని పెళ్ళాన్ని పుట్టింటికి అంపేసాడు. తనకో వాచీ, చెల్లికో బెంగుళూరు పట్టుచీర కావాలంట... ఈ సారి దానత్త గమ్ముండింది. మొగుడు మాత్తరం మొండి కేసాడు."

" 'ఈ ఆడమూకను ఎవరు సాకతారు, కావాల్సింది మొకాన కొట్టి పంపేయండి' అంటాడు దాని మొగుడు.... చిండబ్బు సంపాయించలేడు కానీ.... మాటలు మాత్తరం కోటలు దాటతాయి..."

"ఇంత అన్యాయం జరుగుతుంటే ఎవ్వరూ అడగరా?..." ఆ మాట అడగకుండా వుండలేకపోయాను.

"ఏడమ్మా... ఎవళ్ళకు ఆళ్ళే మాకెందుకులే అనుకుంటుంటే..."

నేను నిట్టూర్చాను.

'వాళ్ళక్కూడా పెద్ద వాళ్ళ జాడ్యం అంటుకుందా? పేదవాళ్ళలో కూడా ఐకమత్యం అడుగంటిపోయిందా?'

"ఇప్పుడైనా వచ్చేదనుకున్నారా?.... దీనికి ఎన్ని భాద్దైతలనీ.... ముసలి మామని కాటికి పంపాలా? ఆఖరి దానికి పెళ్ళి చెయ్యాలా?... అందుకని దీని పేణం మీద దీనికి ఆశపుట్టుకొచ్చింది..." నాకు మాట్లాడడానికి ఇంకేమీ మిగల్లేదు.

"సరే తల్లే. ఇదో రెండేలు... మళ్ళా తల తాకట్టెట్టి కట్టద్ది.... మీ ఋణం వుంచుకోను" లేచి నిలబడి టేబుల్ మీద రెండువేలు చిల్లర కట్ట పెట్టింది.

"అలాగేలే..."

"నా తల్లే! నీ మాత్రం మనసులేకపోయింది దానత్తకు. ఆ రోజు ఉగాది సారెకు మొండికేయకపోతే ఈనాటికి దీనికింత ముదిరి పోయుండేది కాదు" నిట్టూర్చింది జయమ్మ.

నీ కోడలు పెళ్ళినాడు, డబ్బుమూట తీసుకుని నీ గడపతొక్కి... నీకూ నీ కొడుక్కీ చాకిరీ చేసి నీ వంశాన్ని వృద్ధి చేస్తుంటే... ఆ కోడలి తల్లికి కష్టంవస్తే... కన్నీళ్ళు తుడవాల్సింది పోయి... తనకు రావాల్సిన సంప్రదాయపు ముల్లె గురించి ఆలోచించే అత్తల్ని... తనకు సర్వసౌఖ్యాలు ఇచ్చే భార్యను కన్న తల్లిని అవమానపరచి భార్య ప్రేమను పోగొట్టుకుంటున్న భర్తల్నీ... ఏమనాలి?...

సారె అనేది పూర్వీకులు ముచ్చటకు పెట్టుకున్న సాంప్రదాయం అయితే ఆ సారే ఈనాడు ఎంత మంది కళ్ళల్లో కన్నీరు నింపుతోందో!...

"అమ్మా! ఎప్పుడు చేస్తారు ఆపరేషనూ..." నా ఆలోచనాసరం తెగిపోయింది.

"ఆఁ చేస్తాను. మరలా ముక్క పరీక్ష చేసి చేస్తాను" అనేసి సిస్టర్‌ని పిలిచాను. బయాప్సీకి రెడీ చేయమని చెప్పాను. కానీ నా మనసు ఆలోచిస్తూనే వుంది. ఆక్రందిస్తూనే వుంది.

ఏవిటిది?... ఎందుకిలా జరుగుతోంది! పెళ్ళి సారె... అంపకాల సారె... ఉగాది సారె... కడుపు సారె... బిడ్డసారె... వీటన్నిటినీ పెద్దవాళ్ళు రొటీన్ లైఫ్‌లో అప్పుడప్పుడూ ఆనందాల్ని చిందించుకోవడానికి ఏర్పరచిన పండుగలు... అవి ఇప్పుడు... రూల్స్‌గా మారి కన్నీళ్ళు కార్పిస్తున్నాయి.

పరాయివాళ్ళ దగ్గర బహుమతులు తీసుకోవడానికి మొహమాటపడ్తున్న మనం... అయిన వాళ్ళను ఇలా పీడించుకుని తినడం... ఇది ఎందుకు జరుగుతున్నట్టు....

దానికి జవాబు అందరికీ తెలుసు.... దాని పేరు 'సంప్రదాయం'. దాని ముసుగులో మనం చేస్తున్న దోపిడీ ఇది...

"అమ్మా!" త్రుళ్ళిపడ్డాను. పరిసరాలు మర్చిపోయేంతగా ఆలోచింపజేసిందా ఈ సమస్యతనను!

"ఏం జయమ్మా!"

"మీరేదో ఆలోచిస్తున్నారు. కొరవ డబ్బులు పొయ్యేనాటికి పువ్వుల్లో పెట్టి ఇస్తానమ్మా..."

'దూరపు బంధువు అనబడే ఓ పరాయి వ్యక్తి ఈమె కోసం ఎంతలా ఆలోచిస్తోంది! ఆ మాత్రం బాధ్యత... భర్తకు ఎందుకు లేకపోయినట్టు!'

స్వార్థం... సోమరితనం...

"అమ్మా! నమ్మమ్మా... డబ్బులు ఏడకీ పోవమ్మా."

తేరుకున్నాను.

"అది కాదులే జయమ్మా!... సారెలు మనల్ని ఎంత కష్టపెడ్తున్నాయా?... అని ఆలోచిస్తున్నానంతే... ఫీజు గురించి కాదు."

"తప్పుద్దామ్మా, ఆడపిల్లల్ని కన్నాక సారె ఇవ్వకపోతే బాగుంటదా?"

నేను నివ్వెరపోయాను.

ఇదీ మనం!... రేప్రొద్దున ఈ జయమ్మే తన కోడలి దగ్గర నుండి అన్ని రకాల సారెల కోసం పేచీ పెడ్తుంది... అందుకే ఈ పీటముడి విడిపోవడం లేదు.

నిట్టూర్చాను నేను.